## క్లుప్తంగా

### అద్దె చెల్లించని దుకాణాల సీజ్


దుకాణాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

**డోన్:** స్థానిక ఆధునిక కూరగాయల మార్కెట్ భవన సముదాయంలో అద్దెలు చెల్లించని దుకాణాలను సీజ్ చేస్తామని కమిషనర్ ప్రసాద్‌గౌడ్, రెవెన్యూ అధికారి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం భవన సముదాయంలో ఏడాది కాలంగా అద్దె చెల్లించని రెండు దుకాణాలను సీజ్ చేశారు. దుకాణదారులు సకాలంలో అద్దె చెల్లిస్తే పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. దుకాణదారులతో పాటు ఇంటి యజమానులు సకాలంలో ఇంటి, నీటి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది మోహన్, సురేష్, జహంగీర్ తదితరులు ఉన్నారు.

### బాధ్యతల స్వీకరణ

**బనగానపల్లె రూరల్:** జాతీయ ఉపాధిహామీ పథకం ఏపీఓగా ప్రతాప్, ఈసీగా రాజాబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఏపీఓగా ఉన్న రేష్మా, ఈసీగా ఉన్న మక్బుల్ జూపాడుబంగ్లా మండలానికి బదిలీ అయ్యారు. రుద్రవరం మండలంలో పనిచేస్తున్న ప్రతాప్, కొలిమిగుండ్ల మండలంలో పనిచేస్తున్న రాజాబాబు బదిలీపై బనగానపల్లె వచ్చారు. అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు మంజూరు చేసి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీఓ తెలిపారు.

### అర్హులందరికీ ఉపాధి పనులు

**బేతంచెర్ల:** మండలంలో అర్హులైన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని నూతన ఏపీఓ విజయరాణి అన్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ శేషన్న పాణ్యం మండలానికి బదిలీ అయ్యారు. పాణ్యంలో విధులు నిర్వహిస్తున్న విజయరాణి బేతంచెర్లలో బాధ్యతలు స్వీకరించారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు శైలజ, అమినాబీ, నరసింహులు, పుష్పలత బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

### పాఠ్యపుస్తకాల పంపిణీలో అలసత్వం వహించొద్దు

**కొలిమిగుండ్ల:** కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి త్వరలోనే పాఠ్య పుస్తకాలు వస్తాయని.. పంపిణీలో ఎక్కడా అలసత్వం వహించరాదని స్టేట్ అబ్జర్వర్ హైమేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరుతో పుస్తకాలు అందజేయనుందన్నారు. పుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరుకోగానే సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఎంఈఓ అబ్దుల్ కలాంకు సూచించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలకు పుస్తకాలు అందించగానే వారితో అక్‌నాలెడ్జ్ తీసుకోవాలన్నారు. జిల్లా ఏఎస్ఓ దస్తగిరిరెడ్డి, ఎమ్మార్పీలు మద్దిలేటి, కమల ఉన్నారు.

### 9న బండలాగుడు పోటీలు

**ప్యాపిలి:** మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 9వ తేదీ ఆరు పండ్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రవేశ రుసుం రూ. 600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

### ఇన్‌చార్జ్ ఏజీపీగా శ్రీకాంత్



**కోవెలకుంట్ల:** బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జ్ గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్‌గా కోవెలకుంట్ల ఏజీపీ దూదేకుల ఇమాంకాశీం(శ్రీకాంత్)ను నియమించారు. బనగానపల్లె కోర్టుకు రెగ్యులర్ ఏజీపీని నియమించకపోవడంతో కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జికోర్టు ఏజీపీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు కోర్టుల పరిధిలో పేద కక్షిదారుల పక్షాన నిలిచి వారికి న్యాయం జరిగేలా తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

### నేడు వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటిక

**బేతంచెర్ల:** మండల పరిధిలోని ముసలాయి చెర్వు గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా శనివారం రాత్రి మధ్యరాత్రి పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకం ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలి పారు.కొమ్మూరి కొట్టా వెంకటలక్ష్మి బృందంచే వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర, కలికాల మహిళ పూర్తి నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు.

### ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

**డోన్ టౌన్:** ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షపై ఈ నెల 15,16,17 తేదీల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్జెక్టుల వారీగా సంబంధిత ఉపాధ్యాయులతో శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం

- తడిచిపోయిన మొక్కజొన్న, మిరప దిగుబడులు
- నేలవాలిన వరి
- సంజామల మండలంలో 30.8 మి.మీ వర్షం


కోవెలకుంట్ల వద్ద మిరప దిగుబడులు తడవకుండా కప్పిన పట్టలు


కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి సమీపంలో నేలవాలిన వరి

**కోవెలకుంట్ల:** అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఆరుగాలం కష్టపడిన సాగు చేసిన పంట కళ్ల ముందే నీటి పాలు కావడంతో కంట తడిపెడుతున్నారు.శుక్రవారం కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని సంజామల మండలంలో అత్యధికంగా 30.8 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 24.2 మి.మీ, దొర్నిపాడు మండలంలో 20.4 మి.మీ, అవుకు మండలంలో 9.6 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 8.2 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 6.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. అకాల వర్షాలు వేసవి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించినా రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పైరు చేతికందే దశలో ఉంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేలు వెచ్చించారు. పైరు పొట్టదశలో ఉండగా ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షానికి వరి నేల వాలడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. నేలవాలిన వరిలో వడ్లు రాలిపోవడమే కాకుండా కోత, నూర్పిడి పనులకు ఆటంకం ఏర్పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. పడిపోయిన వరిని కట్టలు కట్టుకోవడం, వరి కోతలు చేపట్టాల్సి ఉండడంతో కూలీల రూపంలో అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. మొక్కజొన్న పంటలో కోత, నూర్పిడి పనులు సాగుతున్నాయి. దిగుబడులను కల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. మిరపలో చివరి కోత దిగుబడులను ఎండబెట్టుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఉన్నట్లుండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో దిగుబడులు తడిచిపోవడంతో దిగాలు చెందుతున్నారు. దిగుబడులు తడవకుండా పట్టలు కప్పు కున్నా కొన్ని చోట్ల పట్టలపై నీరు నిల్వ చేరి తడిచిపోయి నష్టం వాటిల్లింది. మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కళాశాల అభివృద్ధికి కృషి

**కోవెలకుంట్ల:** పట్టణంలోని వాసవీబొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాల్ తెలిపారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా ఉన్న కె. వేణుగోపాల్ సెట్కూరు సీఈఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఎం.వేణుగోపాల్‌ను నియమించడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, సంటిరెడ్డి, సుభాష్‌రెడ్డి, కృష్ణదాసు, రాజశేఖర్, అన్నపూర్ణ, కృష్ణశశాంక, లక్ష్మీదేవి, వరప్రసాద్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య ప్రిన్సిపాల్‌కు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.


బాధ్యతలు తీసుకున్న ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

## ఓటర్ల నమోదులో బీఎల్ఓల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రాంభూపాల్

**బనగానపల్లె రూరల్:** ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర కీలకమని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మంజులారెడ్డి కలిసి కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె మండలాలకు చెందిన బీఎల్ఓలకు ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఓలు ఓటర్ల నమోదు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అన్ని సరిగ్గా ఉంటేనే ఆమోదించాలన్నారు. గ్రామాల్లో లేని పేర్లు ఉంటే వారికి నోటీసు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. కోవెలకుంట్ల, సంజామల తహసీల్దార్లు పవన్‌కుమార్‌రెడ్డి, అనీల్‌కుమార్, బనగానపల్లె ఆర్ఐ ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

### వైభవంగా విగ్రహ ప్రతిష్ట

**బేతంచెర్ల:** మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామంలో నిర్మించిన ఆలయంలో సుంకులమ్మ, జమ్ములమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్త జనసందోహం మధ్య అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎద్దులన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

### రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గూటుపల్లె నుంచి పాలుట్ల రంగనాథస్వామి ఆలయానికి రూ.6.20 కోట్లతో ఏర్పాటు చేస్తున్న రహదారి నిర్మాణ పనులను పంచాయతీరాజ్ డీఈ గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం నుంచి అంబాపురం గ్రామం వైపు రూ. 40 లక్షలతో వేసిన కాజ్‌వే నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు. పాలుట్ల రంగనాథస్వామి ఆలయ రహదారికి అటవీశాఖ అభ్యంతరాలు పూర్తవ్వగానే మిగతా రహదారి పనులు చేపడతామని తెలిపారు.

### పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు


ఎర్రగుంట్లపల్లిలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు

**ప్యాపిలి:** మండల పరిధిలోని ఎర్రగుంట్లపల్లి గ్రామంలో పోతిరెడ్డి ధీరజ్‌రెడ్డి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. సొసైటీ అధ్యక్షురాలు భూమిశ్రీ మాట్లాడుతూ.. వేసవి కారణంగా పశువులకు నీటి ఎద్దడి నెలకొందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నీటి తొట్టెలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

**బనగానపల్లె రూరల్:** వైద్య సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు వస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు, వైద్య సేవలు, మందుల వివరాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది తప్పనిసరిగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యశాలల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు.

### వృద్ధురాలిని ఇంటికి చేర్చిన స్ఫూర్తి టీం


కుటుంబ సభ్యులకు అప్పచెబుతున్న స్ఫూర్తి టీం

**డోన్ టౌన్:** మతిస్థిమితం సరిగ్గా లేని వృద్ధురాలిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు స్ఫూర్తి సభ్యులు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వెంకటలచ్చమ్మ(70) మతి స్థిమితం సరిగ్గా లేక నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి కొత్త బస్టాండ్ సమీపంలోని మసీద్ వద్ద తిండిలేక నీరసించి అచేతనంగా పడిపోయింది. గమనించిన స్థానికులు స్ఫూర్తి సంస్థకు సమాచారం ఇవ్వగా స్పందించిన సభ్యులు అక్కడికి వెళ్లి ఆమెకు సపర్యలు చేశారు. స్థానిక పద్మావతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. సోషల్ మీడియాలో ఆమె ఫొటోలు పెట్టగా కుమారుడు రామాంజనేయులు వృద్ధాశ్రమం చేరుకుని తల్లి తీసుకెళ్లాడు.

## బాధితుడికి పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె:** మండలంలోని యనకండ్ల గ్రామంలో మార్చి 31వ తేదీ టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మదనమోహన్‌యాదవ్‌ను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. ఘటన వివరాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### నేలవాలిన వరిపైరు పరిశీలన


నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ

**అవుకు:** వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటలను రక్షించుకోవాలని అవుకు వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో రైతులు సాగు చేసిన వరిపైరును పరిశీలించారు. గురువారం రాత్రి కురిసిన 9.6 మి.మీ వర్షానికి పలుచోట్ల వరిపైరు నేలవాలిందని తెలిపారు. ముఖ్యంగా షుగర్ లెస్ రకం వరి ఎక్కువగా నేలవాలిందన్నారు. నేలవాలిన వరిపైరును కట్టలు కట్టాలని సూచించారు. దీని వల్ల గింజలు రాలిపోవని తెలిపారు. రెండు రోజుల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుందని.. రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు.

## వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

**కోవెలకుంట్ల:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బనగానపల్లె నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాల మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

**నియోజవర్గంలోని ఆయా విభాగాల అధ్యక్షులు**

| విభాగం | బనగానపల్లె | కోవెలకుంట్ల |
|---|---|---|
| యూత్ విభాగం | టి. శ్రీనివాసరెడ్డి | ఎస్. రాంభూపాల్‌రెడ్డి |
| మహిళా విభాగం | తులసిరెడ్డి శ్రీవేణి | భీమిరెడ్డి రమాదేవి |
| రైతు విభాగం | హనుమంతరెడ్డి | కందుల వెంకటేశ్వరరెడ్డి |
| బీసీసెల్ | వి. వెంకటేశ్వర్లు | బి. వెంకటసుబ్బయ్య |
| ఎస్సీసెల్ | జి. దుర్గా ప్రసాద్ | బి. రాజు |
| ఎస్టీసెల్ | పి. రమేష్‌నాయక్ | కె. రామకృష్ణుడు |
| మైనార్టీ సెల్ | ఎస్. మహమ్మద్‌బాషా | ఎస్.అక్బర్‌బాషా |
| స్టూడెంట్ | ఎన్. శివకృష్ణ | జీఎస్. జశ్వంత్‌రెడ్డి |
| వైఎస్సార్‌టీయూసీ | ఎం. నబీరసూల్ | ఎం. రామసుబ్బారెడ్డి |
| వీవర్స్ | పి. శ్రీనివాసులు | లక్ష్మీనారాయణ |
| పంచాయతీరాజ్ | ముల్లామోహన్‌బాబు | సి.రామకృష్ణారెడ్డి |
| వలంటీర్స్ | ఎస్. హైదర్‌నవాజ్ | పి. మహేష్‌కుమార్ |
| అంగన్‌వాడీ | ఎస్. మహమ్మద్ అలీ | ఎస్. దశరథరామిరెడ్డి |
| దివ్యాంగులు | బి. రాంమోహన్‌రెడ్డి | ఎస్. చాంద్‌బాష |
| కల్చరల్ | ఎస్. చిన్నస్వామి | ఏ. శ్రీనివాసరెడ్డి |
| ఆర్‌టీఐ | ఎస్. షేక్షావలి | డి. రామసుబ్బారెడ్డి |
| వాణిజ్య | బి. సుదర్శన్‌రెడ్డి | జి. నాగేశ్వరరెడ్డి |
| క్రిస్టియన్ మైనార్టీ | ఎస్. నాగసుబ్బరాయుడు | కె. దేవరాజు |
| సోషల్ మీడియా | ఎస్, సాదిక్ ఉసేన్ | కె. రమాకాంతరెడ్డి |
| పబ్లిక్ వింగ్ | డి. పాపన్న | బి. విజయభాస్కర్‌రెడ్డి |

### సారా స్థావరాలపై దాడులు


సారా, బైక్‌తో ఎక్సైజ్ సిబ్బంది

**బనగానపల్లె రూరల్:** బనగానపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు ఆ శాఖ సీఐ వర్ధనాదేవి శుక్రవారం తెలిపారు. అవుకు మండలం కొండమనాయునిపల్లెకు చెందిన పెనుగొండ నరేంద్ర నుంచి 60 లీటర్ల నాటుసారా, 400 లీటర్ల బెల్లం ఊటతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాటుసారా తయారీకి సహకరించిన అదే గ్రామానికి చెందిన శ్రీరామ్‌నాయక్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే బనగానపల్లె మండలం ఇల్లూరుకొత్తపేటకు చెందిన దమల పుల్లయ్య వద్ద నుంచి 20 లీటర్ల సారా సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్, జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణదాస్ పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

**అవుకు:** స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న పార్టీ సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆ పార్టీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నూతన కమిటీలు ఏర్పాటైన నేపథ్యంలో అవుకు నూతన కమిటీ సభ్యులతో పాటు మండంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, నాయకులు, సభ్యులు, కార్యకర్తలు రావాలని కోరారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం


వృషభ యజమానులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

**బనగానపల్లె:** మండలంలోని నందవరం గ్రామంలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన న్యూకేటగిరి విభాగం రాతిదూలం పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి నాగరకర్నూల్ జిల్లా చంద్రకళ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు వృషభాలు, రెండో బహుమతి నంద్యాల జిల్లా వనికందిన్నెకు చెందిన పెద్ద సరబయ్య, మూడో బహుమతి మల్లెలకు చెందిన మహిమున్నా, నాల్గో బహుమతి కొత్తపల్లెకు చెందిన వెంకటహారిక, ఐదో బహుమతి ప్రకాశం జిల్లా మర్రివేములకు చెందిన మల్లేశ్వరి, ఆరు, ఏడు బహుమతులు చాబోలికి చెందిన మహమ్మద్‌రఫీ వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేల చొప్పున బహమతులు ప్రదానం చేశారు. పీవీ కుమార్‌రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి, వెంగన్న, రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

### అక్రమ వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

**డోన్ టౌన్:** అక్రమ వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం డోన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌బాబు, జిల్లా అధ్యక్షుడు రంగమ్మ, పట్టణ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని కొందరు వడ్డీ వ్యాపారులు ఖాళీ బాండ్లపై సంతకాలు చేయించుకుని అప్పు చెల్లించినా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.




శిథిలావస్థకు చేరుకుని మూతపడ్డ బీసీ బాలుర వసతి గృహం, కూలేందుకు సిద్ధంగా ఎస్సీ బాలుర వసతి గృహం, నిరుపయోగంగా గ్రామచావిడి

# నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ భవనాలు


మూతపడ్డ సబ్ జైలు


సొదరదిన్నెలో మూతపడ్డ ప్రాథమిక పాఠశాల తరగతి గదులు

ప్రజా పాలన అందించే ప్రభుత్వ భవనాలు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకుని మూతపడగా మరికొన్ని భవనాలు బాగున్నా ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కోవెలకుంట్ల మండలంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భవనాలు శిథిలావస్థకు చేరుకుని మూతపడ్డాయి. పట్టణంలోని బీసీ బాలుర, ఎస్సీ బాలుర వసతిగృహాలు, గ్రామ రెవెన్యూ అధికారుల కార్యాలయం, హౌసింగ్ డీఈ కార్యాలయం, సబ్‌జైలు భవనం, ఎస్సార్బీసీ క్వార్టర్స్, రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సొదరదిన్నె ప్రాథమిక పాఠశాల తరగతి గదులు మూతపడడంతో ప్రజా ధనం వృథా అయి oది. కొన్ని కార్యాలయాలను అద్దె భవనాల్లో కొనసాగిస్తుండడంతో ప్రభుత్వంపై ఏడాదికి లక్షలాది రూపాయాల చొప్పున అద్దె భారం పడుతోంది. సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరుకున్న ప్ర భుత్వ భవనాలకు మరమ్మతులు చేపట్టి వినియో గంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు. –కోవెలకుంట్ల

### అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న విక్కీ పౌండేషన్ సభ్యులు

**కోవెలకుంట్ల:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రం గుర్తు తెలియని యాచకుడు(సుమారు 60 ఏళ్లు) వడదెబ్బతో మృతి చెందాడు. వివరాలు తెలియకపోవడంతో అనాథ శవంగా భావించి పోలీసులు విక్కీ పౌండేషన్‌కు సమాచారం అందించారు. ఆ పౌండేషన్ అధినేత గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**కోవెలకుంట్ల:** పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాలు సమీపంలో శుక్రవారం పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సంజామల మండలం ఆల్వకొండకు చెందిన ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 14 వేల నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు.